క్లుప్తంగా

విజయవంతం చేయండి

లింగాలఘణపురం: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 12న స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు నిర్వహించే తెలంగాణ 2కే రన్‌లో మండలంలోని యువత పాల్గొని విజయవంతం చేయాలని ఎస్సై ప్రవీణ్ కోరారు. అంతేకాకుండా మండలంలోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు కూడా పాల్గొనాలని, 2కే రన్‌లో పాల్గొనే వారికి టీషర్టుల పంపిణీ, బహుమతి ప్రదానం ఉంటుందని ఎస్సై వివరించారు.

మంద కృష్ణ పోరాట ఫలితమే పింఛన్ల పెంపు



బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి దివ్యాంగ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కన్వీనర్ పైస రాజశేఖర్ మాట్లాడుతూ మంద కృష్ణ చేసిన పోరాట ఫలితమే దివ్యాంగుల పింఛన్ల పెంపు అని అన్నారు. కార్యక్రమంలో కామిడి సిద్ధారెడ్డి, అల్వాల రాజు, స్వామి, పాకాల కుమారస్వామి, కంటెం కనుకయ్య, మల్లేష్, శ్రీనివాస్, సిద్దిరాములు, అయిలయ్య, యాదగిరి, భరత్, పర్శరాములు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత



గుంతను పూడ్పించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెం–ఫత్తేపూర్ రోడ్డు వెంట కేబుల్ వేసేందుకు తీసిన గుంతలను పూడ్చకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మేరకు 'ప్రమాదకరంగా గుంత' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం పంచాయతీ కార్యదర్శి తండా రాంబాబు ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు గుంతలను మట్టితో పూడ్పించారు.

పరామర్శ



జనగామ: పట్టణంలోని హనుమకొండరోడ్డులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పీఆర్ ఆర్డీ స్టేట్ డైరెక్టర్, కొడకండ్ల ఎంపీటీసీల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె యాకయ్య తండ్రి మల్లయ్యను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శనివారం పరామర్శించారు. మల్లయ్య ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. మంత్రి వెంట దేవరుప్పుల బీఆర్ఎస్ నాయకులు సుందర్ రామిరెడ్డి, అందె రవి కుమార్, దూలం సతీష్, తీగల సందీప్ ఉన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



రాజ్యలక్ష్మి(ఫైల్)

జనగామ: పట్టణంలోని రెడ్డి స్ట్రీట్‌కు చెందిన శతాధిక వృద్ధురాలు మాడిశెట్టి రాజ్యలక్ష్మి (101) శనివారం మృతి చెందింది. వందేళ్లు పూర్తి చేసుకుని నాలుగు తరాల కుటుంబ సభ్యులతో కలిసి ఆమె ఇటీవల వేడుకలను నిర్వహించుకున్నారు. బతికి ఉన్నంతకాలం ఒకరిపై ఆధారపడకుండా తుదిశ్వాస విడిచే వరకు ఆమె సొంతంగానే పనులు చేసుకున్నారు. మృతురాలు రాజ్యలక్ష్మిని చూసిన ప్రతి ఒక్కరూ ఆ నాటి తరం ఆహారమే ఇప్పటి వరకు ఆరోగ్యంగా ఉండేలా చేసిందని మాట్లాడుకునే వారు. పలువురు ప్రముఖులు ఆమెకు నివాళులర్పించారు. మృతురాలికి కొడుకు సోమశేఖర్, కూతురు ఉన్నారు.

సంతాపం



ఉమేష్ (ఫైల్)

బచ్చన్నపేట: వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న అవదూత ఉమేష్(34) మృతిపై శనివారం పలువురు సంతాపం తెలిపారు. భూపాలపల్లిలోని వైద్యారోగ్యశాఖలో ఎంఎస్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న ఉమేష్ అకాల మృతి అందరిని కలచివేసింది. ఆయన మృతి పట్ల బచ్చన్నపేట సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి, ఎంపీటీసీలు నల్లగోని పుష్ప, అల్వాల రాధ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లగిశెట్టి అశోక్‌కుమార్, డాక్టర్ సిద్ధార్థరెడ్డి, వైద్య సిబ్బంది, అతడి స్నేహితులు సంతాపం ప్రకటించారు. అనంతరం గ్రామంలో అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

కేసీఆర్ పాలనలోనే సంక్షేమ పథకాలు



చిల్పూరు: మాట్లాడుతున్న ఎంపీపీ సరిత



బచ్చన్నపేట: మాట్లాడుతున్న సర్పంచ్ స్వామి

చిల్పూరు: సీఎం కేసీఆర్ పాలనలోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీపీ సరిత అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శనివారం సంక్షేమ పథకాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై చర్చించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ దేవ్‌సింగ్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, డీటీ విమల, ఉపాధి ఏపీఓ మోహన్‌రావు, ఎంపీటీసీలు సాదం నర్సింహులు, సుధాకర్, యాదగిరి, కార్యదర్శులు రంగారెడ్డి, శ్రీకాంత్, శశికుమార్, నాయకులు బొమ్మిశెట్టి బాలరాజు, కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, రంగు హరీష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో గ్రామాభివృద్ధి

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో గ్రామాలు అభివృద్ధి చెందాయని మండలంలోని వంగ సుదర్శన్‌రెడ్డి నగర్ సర్పంచ్ కోనేటి స్వామి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని జీపీ కార్యాలయంలో సుపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జీపీ అభివృద్ధికి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఎంతగానో సహకరించారని అన్నారు. గ్రామాభివృద్ధికి రూ.90 లక్షల నిధులు మంజూరు చేశారని.. ఇందుకు సహకరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషలాఫీసర్ దిలీప్, కార్యదర్శి రుబీనా సుల్తానా, ఉప సర్పంచ్ చవాన్ నరేష్, వార్డు సభ్యులు కల్యాణం అనసూర్య, కృష్ణవేణి, మోతె రాజు, రజిత, రేణుక, సంజీవరెడ్డి అంగన్‌వాడీ టీచర్లు హిజీర బేగం, నాయకులతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఆకేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేయిస్తా..



చిల్పూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

చిల్పూరు: నష్కల్ వద్ద ఆకేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేయిస్తానని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. మండలంలోని వంగాలపల్లి, నష్కల్, చిన్నపెండ్యాల, దేశాయితండా, తీగలతండా, రాజవరం గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే ప్రగతి నివేదన యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు ప్రణితప్రదీప్, కర్ణకంటి స్వప్నవెంకటేష్, లక్ష్మీఠాకూర్, మారేపల్లి తిరులమల అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ దేవ్‌సింగ్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీపీ సరిత, చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు, ఎంపీఓ మధుసూదన్, మార్కెట్ చైర్మన్ రాజు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కులవృత్తులను ప్రోత్సహిస్తున్న సీఎం కేసీఆర్

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కులవృత్తులను ప్రోత్సహిస్తూ బీసీ కులాలకు ఆర్థిక సహాయం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించిందని స్థానిక ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరుగక ముందు, రాష్ట్ర ఏర్పాటు అయ్యాక జరిగిన అభివృద్ధి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. ఏ నియోజకవర్గంలో లేనివిధంగా స్టేషన్‌ఘన్‌పూర్‌లో వినూత్నంగా పల్లె ప్రగతి నివేదన యాత్ర చేస్తున్నానని, స్వయంగా గ్రామాల్లో తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పల్లె నిద్రలు చేస్తూ రచ్చబండ కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని ఉద్వేగంగా తెలిపారు.

సంక్షేమ రంగాలకు ఆద్యుడు అంబేద్కర్

సంక్షేమ రంగాలకు అద్యుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో వినూత్న పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందిస్తున్నారన్నారు. స్థానిక సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గణేష్, ఎంపీటీసీ నర్సింహులు, రాజు, నాయకులు జీన్నారు.

సీఎం ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం



బచ్చన్నపేట: కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



కొడకండ్ల: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, దివ్యాంగులు

కొడకండ్ల: దివ్యాంగుల పింఛన్ రూ.4,116కు పెంచుతూ సీఎం కేసీఆర్ ప్రకటించడంపై దివ్యాంగులు హర్షం వెలిబుచ్చారు. శనివారం మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్, మంత్రి దయాకర్‌రావు ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం నిర్వహించారు. మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ, యూత్ అధ్యక్షుడు సతీష్‌గౌడ్, వైస్ ఎంపీపీ వీరస్వామి, సర్పంచ్ మధుసూదన్, మార్కెట్ డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, ఆసీఫ్, దూలం సతీష్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల క్షేమాన్ని కోరేది టీఆర్ఎస్ ప్రభుత్వమని అన్నారు. దివ్యాంగులకు నెలకు ఫింఛన్‌ను రూ.4,116కి పెంచడంతో హర్షం వ్యక్తం చేశారు. రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, జడ్పీ వైస్ చైర్ పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్, దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు కామిడి సిద్దారెడ్డి, నాయకులు అంజయ్య, షబ్బీర్, జిల్లా సందీప్ దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



సాల్వాపూర్‌లో ఆర్థికసాయం అందజేస్తున్న కిరణ్‌కుమార్‌గౌడ్

బచ్చన్నపేట: మండలంలోని సాల్వాపూర్‌లో ఇటీవల మృతి చెందిన తన్నీరు ప్రవీణ్ కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ రూ. 5 వేల ఆర్థికసాయాన్ని అందించారు. శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే బసిరెడ్డిపల్లిలో మృతి చెందిన సర్పంచ్ బాలగోని పర్శరాములుగౌడ్ కుటుంబాన్ని పరామర్శించి మృతుడి కుమార్తెకు భవిష్యత్‌లో తోడ్పాటును అందిస్తానని హామీ ఇచ్చారు. బండకింది సింగరయ్యగౌడ్, వేముల లక్ష్మణ్‌గౌడ్, గూడెపు తిరుపతిగౌడ్, రాజు, కిష్టయ్య, రామచంద్రం, బాల్‌రెడ్డి, అంజయ్య, వెంకటేష్, బిక్షపతి, నర్సింహులు, అశోక్, ఉదయ్ పాల్గొన్నారు.

కుల వృత్తులకు ప్రాధాన్యం



జీవాలను పంపిణీ చేస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తులకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నదని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పశువైద్యశాలలో రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డితో కలిసి ప్రభుత్వ సబ్సిడీ జీవాల యూనిట్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ బచ్చన్నపేట, పోచన్నపేట, కొడవటూర్ గ్రామాల లబ్ధిదారులకు ఒక్కో యూనిట్ చొప్పున జీవాలను పంపిణీ చేశామన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి జీవాలను అందించడం జరుగుతుందన్నారు. గొల్ల, కురుములు జీవాలను సాదుకుంటూ జీవనోపాధిని పొందాలన్నారు. సబ్సిడీ జీవాలను విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలోనే మండలంలోని లబ్ధిదారులకు జీవాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్, సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి, వైద్యులు రామారావు, నాయకులు గిరబోయిన అంజయ్య, జూకంటి కిష్టయ్య, అజీమ్, సిద్దిరాంరెడ్డి, ఖైసర్, శ్రీనివాస్ పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం

రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తుందని జెడ్పీ వైస్ చైర్ పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని గోపాల్‌నగర్ జీపీ కార్యాలయంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన వెల్‌బేబీ షోలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎదుగుదలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. ఆరోగ్యంగా జీవించడానికి తీసుకోవాల్సిన ఆహార పదార్థాలపై ప్రజలందరికీ అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. గ్రామ సర్పంచ్ పర్వతం మధుప్రసాద్, కార్యదర్శి మోకు కవిత, అంగన్‌వాడీలు భాగ్యలక్ష్మి, లక్ష్మి, వార్డు సభ్యులు వల్లాల ప్రవీణ, ప్రసన్న, నర్సింహులు పాల్గొన్నారు.

'ధరణి'తో రిజిస్ట్రేషన్లు సులభతరం



కార్యాలయం ఎదుట ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న తహసీల్దార్ హరిప్రసాద్

తరిగొప్పుల: ధరణి పోర్టల్‌తో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సులభతరం అయ్యిందని తహసీల్దార్ బాశెట్టి హరిప్రసాద్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ప్రగతి నివేదిక ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ మండలాల ఏర్పాటుతో రెవెన్యూ పరిపాలన ప్రజల చెంతకు వచ్చిందన్నారు. మండల పరిధిలో 2017–18 వరకు 715 కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. 3,428 భూ రిజిస్ట్రేషన్లు చేయడం జరిగిందని తెలిపారు. సర్పంచ్ దామెర ప్రభుదాస్, ఎంపీటీసీ అర్జుల మదుసూధన్‌రెడ్డి, తాళ్లపల్లి పోషయ్య, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వంతెనల నిర్మాణానికి శంకుస్థాపన

దేవరుప్పుల : తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు మూడు గ్రామాల్లో వంతెనల నిర్మాణ పనులకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శంకుస్థాపన చేయనున్నట్లు ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేషం, జెడ్పీటీసీ పల్ల భార్గవిసుందర్ రామిరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటలకు రూ.11 కోట్ల వ్యయంతో మండలంలోని చిన్న మడూరు–రంభోజిగూడెం వాగులపై, చిన్న మడూరు దుర్గమ్మగుడి–అప్పిరెడ్డిపల్లిల మధ్య వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని, అనంతరం చిన్నమడూరు నూతన గ్రామ పంచాయతీ, పల్లె దవాఖాన ప్రారంభిస్తారన్నారు. రూ.8 కోట్లతో పెద్దమడూరు –కడవెండి గ్రామాల వాగు మధ్య వంతెన పనులకు శంకుస్థాపనతోపా టు డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద 20 కే.ఎల్. మిషన్ భగీరథ నీటి ట్యాంకును ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

చంద్రయ్య మృతి పార్టీకి తీరని లోటు



నివాళులర్పిస్తున్న లక్ష్మీనారాయణ తదితరులు

దేవరుప్పుల : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దండు చంద్రయ్య అకాల మృతి పార్టీకి తీరని లోటని టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణనాయక్ అన్నారు. శనివారం మండలంలోని అప్పిరెడ్డిపల్లెకు చెందిన చంద్రయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, గ్రామ అధ్యక్షుడు కొమురయ్య,మాజీ సర్పంచ్ పులిగిల్ల మల్లయ్య, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు భాగాల మాలతి రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు బోనగిరి యాకస్వామి,రాంబాబు,వెంకట్ రెడ్డి, కొండాజి,హనుమారెడ్డి, నరసయ్య, మల్లయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి అంత్యక్రియలు



దహన సంస్కారాలు నిర్వహిస్తున్నన సర్పంచ్

పాలకుర్తి టౌన్/పాలకుర్తి: మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద భిక్షాటన చేసి జీవిస్తూ అనారోగ్యంతో శుక్రవారం రాత్రి స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన వృద్ధుడు కీర్తి ముత్యం(75) మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న సర్పంచ్ వీరమానేని యాకాంతారావు పంచాయతీ సిబ్బందితో అర్ధరాత్రి నూతన శ్మశాన వాటికలో వృద్ధుడికి దహన సంస్కారాలు నిర్వహించారు. స్థానిక ఎస్సై తాళ్ల శ్రీకాంత్, ఎంపీటీసీ ఎడవెల్లిపురుషోత్తం, అతని బంధువులు మేరు సంఘము అధ్యక్షుడు కీర్తిరాజ్‌కుమార్, ఉమ, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా



చెక్కులు పంపిణీ చేస్తున్న సిందె రామోజీ

కొడకండ్ల: నిరుపేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసాగా నిలుస్తుందని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ అన్నారు. శనివారం రామవరం గ్రామానికి చెందిన అనీల్‌కుమార్, భీంరావు, యాకూబ్‌పాషా, మహేందర్, నాగయ్యచారి, కేతమ్మలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల గాయపడిన సర్దార్ యాకయ్యను ఆయన పరామర్శించారు. సర్పంచ్ శిరీష, ఎంపీటీసీ మణెమ్మ, నాయకులు సోమరాములు, యాకూబ్, రాజిరెడ్డి, మల్లేష్, రేణుక, అంజనేయులు, నర్సింహస్వామి, సందీప్, నవీన్, రణధీర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్



శ్రీకాంత్‌గౌడ్

దేవరుప్పుల: మండలంలోని పెద్దమడూరుకు చెందిన బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ ప్రముఖ యువవ్యాపారిగా రాణిస్తూ సామాజిక సేవకుడిగా గుర్తింపు పొంది నేడు బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు. గత ఏడాది నుంచి రాజ్యాంగకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మారక విగ్రహాలు, ఆధ్యాత్మిక చింతన పెంపొందించే దిశలో ఆయా సామాజిక వర్గాల కులదేవతల విగ్రహాల ఆవిష్కరణకు విరివిగా విరాళాలు అందజేశారు. అడిగిందే తడువుగా పేదింటి ఆడపడుచులకు పుస్తె మట్టెలు, నిలువనీడలేని పేదలు, మృతుల కుటుంబాలకు బాసటగా నిలుస్తూ మండల ప్రజల మన్ననలు పొందుతుంది విదితమే. ఈ క్రమంలోనే రాజకీయంగా ప్రజలకు మరింత సేవలందించాలనే సంకల్పంతో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలకు హాజరవుతున్న పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ



బస్‌పాస్‌లు అందజేస్తున్న సర్పంచ్ మల్లేష్

రఘునాథపల్లి: జనగామ ఆర్టీసీ డిపో మెనేజర్ వి జ్యోత్స్న ఆదేశాల మేరకు శనివారం మండలంలోని వెల్దిలో దివ్యాంగులకు బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ కొయ్యడ మల్లేష్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ప్రతినిధులు గ్రామంలోని దివ్యాంగులకు బస్సుపాస్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ప్రతినిధులు కుర్ర సురేందర్ గౌడ్, భిక్షపతి మాట్లాడుతూ ఆర్టీసీని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. దివ్యాంగులు బస్సుపాస్‌ల కోసం ఇబ్బందులు పడకుండా నేరుగా వారి స్వగ్రామానికి చేరుకొని అందజేస్తున్నామని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ పెండ్లి మల్లారెడ్డి, వార్డు సభ్యుడు పెద్దగోని రాజు, నాగేష్ పాల్గొన్నారు.

'జాజుల' జన్మదిన వేడుకలు

జనగామ రూరల్: బీసీ ఉద్యమ సారధి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ పుట్టిన రోజు వేడుకలను శనివారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు వేముల విద్యాసాగర్ రావు, రాష్ట్ర నాయకులు తీగల సిద్దు, గుర్రపు బాలరాజు, వేణు, నవీన్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి పనిచేయాలి



మాట్లాడుతున్న దేవి తిరుపతి రెడ్డి

చిల్పూరు: నూతన కమిటీలు పార్టీ బలోపేతం కోసం కృషిచేయాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా నాయకుడు దేవి తిరుపతి రెడ్డి, సాదం గట్టయ్య, పరమేష్ అన్నారు. మండలంలోని వెంకటాద్రిపేటలో శనివారం టీపీసీసీ సభ్యులు దొమ్మాటి సాంబయ్య ఆదేశానుసారం మండల కమిటీని ప్రకటించారు. అధికార ప్రతినిధిగా మంతెన లవన్‌కుమార్, ఉపాధ్యక్షులు బాలరాజు, రమేష్‌లతో పాటు భాస్కర్‌రెడ్డి, రాజయ్య, రాజ్‌కుమార్, సునీల్, రాజు, పరమేశ్వర్, రాంలాల్, రాజేశ్వర్, యాదగిరి, రజాక్, బుచ్చిరెడ్డి ఎన్నికయ్యారు.

'చేనేత కార్మికులపై సర్కార్ వివక్ష'

రఘునాథపల్లి: చేనేత కార్మికులు, పద్మశాలీ కులస్తుల సంక్షేమానికి ప్రభుత్వం ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వకుండా వివక్ష చూపుతుందని పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేతి వృత్తి దారులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తామన్న సీఎం కేసీఆర్ పద్మశాలి కులస్తులను విస్మరించడం దారుణమన్నారు. కులవృత్తినే నమ్ముకొని జీవిస్తున్న చేనేత కార్మికులు పనులు లేక అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడిన ప్రతి పద్మశాలి కులస్తుడికి రూ.లక్ష అందజేయాలని డిమాండ్ చేశారు. పద్మశాలి కులస్తులపై అదే వివక్షత చూపితే, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు.